## 239వ అధ్యాయం

## ٢٣٩ ـ بَابُ فَضْلِ العِبَادَةِ فِي الْهَرْجِ وَهُوَ الاخْتِلاطُ وَالْفِتَنُ وَنَحْوُهَا

## ఉపద్రవ కాలంలో దైవారాధన చేయటం

١٣٦٧ ـ عَنْ مَعقِلِ بنِ يَسَارٍ، رَضِيَ اللهُ عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «العِبَادَةُ فِي الهَرْجِ كهِجْرَةٍ إلَيَّ». رواهُ مُسْلِمٌ.

1367. హజ్రత్ మాఖిల్ బిన్ యసార్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఈ విధంగా ప్రవచించారు: కల్లోలాలు, ఉపద్రవాల కాలంలో దైవారాధన చేయటం నా దగ్గరకు వలస రావటంతో సమానం. (ముస్లిం)

*(సహీహ్ ముస్లింలోని ఉపద్రవాల ప్రకరణం)*

### ముఖ్యాంశాలు

మక్కా అవిశ్వాసుల ఆగడాలు, వేధింపులు తారాస్థాయికి చేరుకున్నప్పుడు మహాప్రవక్త (సల్లం) మక్కా నుండి మదీనాకు వెళ్ళవలసి వచ్చింది. దాన్నే 'హిజ్రత్' అన్నారు. దైవప్రవక్త మదీనాకు వలస వెళ్ళిన తర్వాత ఇతర ముస్లింలు కూడా వీలైతే తప్పకుండా ఆయన వద్దకు, అంటే మదీనాకు వలస వెళ్ళాలన్న ఆదేశం అవతరించింది. ఆ కాలంలో మదీనాకు వలస వెళ్ళటమంటే సామాన్య విషయం కాదు. అవిశ్వాసుల కళ్ళుగప్పి, ప్రాణాలకు తెగించి వారితో పోరాడి వెళ్ళవలసి వచ్చేది. ఒక సుప్రసిద్ధ సహచరుడయితే తాను సంపాయించిన లక్షల ఆస్తిని అవిశ్వాసులకు పరిహారంగా ఇచ్చి మదీనాకు ప్రస్థానం చేశారు. దీనిద్వారా ఆ రోజుల్లో మదీనా ప్రస్థానం ఎంత పుణ్యప్రదమైన విషయంగా భావించబడేదో అర్థమవుతుంది.

పై హదీసులో సర్వత్రా కల్లోలాలు వ్యాపించి ధర్మాన్ని ఆచరించటమే కష్టమైపోయే ఉపద్రవభరిత యుగంలో ఆరాధన చేయటం తన వద్దకు వలస రావటంతో సమానమని, దానికీ హిజ్రత్ చేసినంత పుణ్యం లభిస్తుందని దైవప్రవక్త (స) ప్రకటించారు. దైవారాధన అంటే కేవలం నమాజులు, వ్రతాలు పాటించటమే కాదు. దేవునికి విధేయత చూపటం, దైవాజ్ఞల్ని పాటించటం, మంచిని గురించి ప్రజలకు బోధించటం, చెడుల నుండి వారిని వారించటం- ఇవన్నీ ఆరాధన క్రిందికే వస్తాయి. కల్లోల భరితమైన సమయంలో ఈ విధమైన దైవారాధన చేయటం కత్తిమీద సాము వంటిదే. అయినప్పటికీ పరిస్థితుల్ని మనో నిబ్బరంతో, ఆత్మ విశ్వాసంతో ఎదుర్కుంటూ సాధన చేసినవారికి, ఆరాధన నెరవేర్చినవారికి తప్పకుండా హిజ్రత్ చేసినంత పుణ్యం లభిస్తుంది.